ఎల్ అగ్రహారంలో 'పొలం పిలుస్తోంది'

తాడేపల్లిగూడెం: 30 రోజులు దాటాక కాంప్లెక్స్ ఎరువులు వాడొద్దని తాడేపల్లిగూడెం మండల వ్యవసాయ అధికారి ఆర్ఎస్.ప్రసాద్ సూచించారు. మండలంలోని ఎల్.అగ్రహారం గ్రామంలో మంగళవారం జరిగిన పొలం పిలుస్తుంది కార్యక్రమంలో ఎడిఎ పి.మురళీకృష్ణ, మండల వ్యవసాయ అధికారి ఆర్ఎస్.ప్రసాద్ పాల్గొన్నారు. రైతులు 30 రోజులు దాటాక కాంప్లెక్స్ ఎరువులు వాడొద్దని మండల వ్యవసాయ అధికారి ఆర్ఎస్.ప్రసాద్ తెలిపారు. ఆఖరి కోటాలో యూరియా పొటాస్ కలిపి వేసుకోవాలని సూచించారు. ప్రతి రైతు ఈ పంటలో తాము సాగు చేస్తున్న వివరాలు నమోదు చేయించుకోవాలని సూచించారు. ఉద్యాన శాఖ అధికారి శ్రీలక్ష్మి మాట్లాడుతూ కొబ్బరి మొక్కలకు కూడా రాష్ట్ర ప్రభుత్వం బీమా సదుపాయం కల్పించిందని, కొబ్బరి వేసిన ప్రతి రైతు బీమా చేయించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎడిఎపి మురళీకృష్ణ, మండల వ్యవసాయ అధికారి ఆర్ఎస్.ప్రసాద్, ఉద్యానశాఖ అధికారి శ్రీలక్ష్మి, ఆర్ఎస్కె ఇన్‌ఛార్జి నందిని పాల్గొన్నారు.

కష్టాల సాగు..!

భారీగా పెరిగిన దాళ్వా పెట్టుబడి
భారంగా ఎరువులు, పురుగు మందుల ధరలు
ఎకరాకు రూ.40 వేల వరకూ పెట్టుబడి
వ్యవసాయానికి ప్రభుత్వ ప్రోత్సాహం అంతంతమాత్రమే
తగ్గుముఖం పడుతున్న వరి సాగు
కౌలు రైతుల పరిస్థితి మరింత దారుణం
ప్రభుత్వం దృష్టి సారించకపోతే సాగు ప్రశ్నార్థకమే

ప్రజాశక్తి - భీమవరం

రైతన్న కష్టమంతా పెట్టుబడికే సరిపోతుంది. పెరిగిన ఎరువులు, పురుగుమందుల ధరలు, ఇతర భారాలు రైతులను ఆర్థికంగా కుంగదీస్తున్నాయి. ఎకరాకు రూ.35 వేల నుంచి రూ.40 వేల వరకూ పెట్టుబడి పెడుతున్న రైతన్నకు ఆశాజనకంగా పంట పండితే రూ.50 వేల వరకూ వస్తుంది. అయితే ప్రకృతి వైపరీత్యాలు ఆ మొత్తాన్ని చేతికి రానీయడం లేదు. దీంతో పేద, మధ్య తరగతి రైతులతోపాటు కౌలురైతుల పరిస్థితి దయనీయంగా మారింది. రైతులకు ప్రభుత్వాలు పూర్తిస్థాయిలో ప్రోత్సాహం అందించకపోవడంతో కష్టనష్టాల నడుమ దాళ్వా సాగు ముందుకు సాగుతోంది. ఉమ్మడి జిల్లాలో సార్వా సాగుకు వ్యవసాయ శాఖ ముందస్తు ప్రణాళిక రూపొందించినప్పటికీ దాన్ని రైతులు అందుపుచ్చుకొనే పరిస్థితి ఉంది. పశ్చిమగోదావరి జిల్లాలో సుమారు 2 లక్షల 14 వేల ఎకరాలు, ఏలూరు జిల్లాలో లక్షా 40 వేల ఎకరాల్లో ఈ ఏడాది దాళ్వాసాగు చేపట్టారు. అయితే గతేడాది డిసెంబర్ నెలాఖరు నాటికి నాట్లు ప్రక్రియ పూర్తి కావాల్సి ఉంది. అయితే ఈ ఏడాది జనవరి నెలాఖరైనా నాట్లు ప్రక్రియ పూర్తిస్థాయిలో పూర్తి కాలేదు. పశ్చిమగోదావరి జిల్లాలో 85 శాతం, ఏలూరు జిల్లాలో 75 శాతం మాత్రమే నాట్లు ప్రక్రియ పూర్తయ్యింది.

ఏటా ముందస్తు సాగుకు సన్నద్ధం కావాలంటూ వ్యవసాయ శాఖ ప్రచారాలు చేయడమే తప్ప దానిపై దృష్టి సారించి ఫలితాలు రాబట్టడంలో విఫలమైందనే విమర్శలు ఉన్నాయి. దీనికితోడు సాగునీటి సమస్య ప్రధానంగా వేధిస్తోంది. సాగునీటి సరఫరాకు ప్రణాళికలు రూపొందించినప్పటికీ పూర్తిస్థాయిలో తాగునీరు అందే పరిస్థితి కనిపించడం లేదు. మరికొన్ని రోజుల్లో వంతుల వారీ విధానం అమలు జరిగే పరిస్థితి ఉంది. ఈ నేపథ్యంలో శివారు ప్రాంత పొలాలకు నీరందే పరిస్థితి లేదు. దీనికితోడు సాగులో పలు సమస్యలు వెంటాడుతున్నాయి. రెండు జిల్లాల్లో సుమారు 7 లక్షల మంది రైతులుండగా వారిలో సుమారు 4 లక్షల మంది వరకూ కౌలురైతులే ఉన్నారు. నూటికి 80 శాతం కౌలు రైతులే సాగు చేస్తున్నారు. గతంతో పోలిస్తే యాంత్రీకరణ పెరగడం, ఎరువులు, పురుగుమందుల ధరలు పెరిగిపోవడంతో పెట్టుబడి ఖర్చులు అమాంతం పెరిగాయి. గతంతో పోలిస్తే యూరియా బస్తాపై రూ. 30 నుంచి రూ.50 వరకూ అదనంగా పెరిగింది. దీనికితోడు పురుగు మందుల ధరలు కూడా పెరిగాయి. దీంతో పెట్టుబడులకు తగ్గ ఆదాయం రాకపోవడంతో రైతులు సాగుకు దూరమవుతున్నారు. ఎకరాకు సరాసరి రూ.35 వేల నుంచి రూ.40 వేల వరకూ పెట్టుబడి పెట్టాల్సిన పరిస్థితి నెలకొంది. ఎకరాకు రూ.50 వేల వరకూ వస్తున్నప్పటికీ కేవలం రూ.10 వేలు మాత్రమే రైతుల చేతికి అందే పరిస్థితి నెలకొంది. అదీ ప్రకృతి వైపరీత్యాలు సంభవించకుండా పంట సంపూర్ణంగా చేతికి అందితేనే. కొన్ని పరిస్థితుల్లో చిల్లిగవ్వ కూడా రైతులకు వచ్చే పరిస్థితి లేదు. ఈ నేపథ్యంలో కౌలురైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. గుర్తింపు కార్డులు లేక, రుణ సాయం, నష్టపరిహారం, బీమా వంటివేమీ వీరికి అందడం లేదు. జిల్లాలో నరసాపురం,

యలమంచిలి, పాలకోడేరు, గణపవరం, భీమవరం రూరల్ పరిధిలోని గ్రామాల్లో వ్యవసాయ భూములు బీడుగా వదిలేస్తున్నారు. గతేడాది సార్వాలో 20 వేల హెక్టార్లలో సాగు చేయకుండా వదిలేశారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

అంతంత మాత్రంగానే ప్రభుత్వ ప్రోత్సాహం..

ప్రభుత్వ లబ్ధి భూయజమాని అంగీకారం లేకపోవడంతో కౌలురైతులు పూర్తిగా నష్టపోతున్నారు. అయితే ఎక్కువ శాతం కౌలురైతులు సాగు చేస్తున్నప్పటికీ వారికి సాయం అందించడంలో ప్రభుత్వాలు వెనుకంజలోనే ఉన్నాయి. ప్రభుత్వం అందించే లబ్ధిలోనూ సవాలక్ష నిబంధనలు పెట్టి అసలైన సాగుదారునికి అన్యాయం చేస్తున్నారు. సాగులో ప్రధానపాత్ర పోషించే యాంత్రిక పనిముట్లకు ఉమ్మడి జిల్లాలో గత ప్రభుత్వం రూ.25 కోట్ల వరకూ బడ్జెట్ కేటాయించినప్పటికీ అతీగతీ లేకుండాపోయింది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలు గడుస్తున్నా వ్యవసాయానికి నిధుల కేటాయింపుపై సరైన స్పష్టత ఇవ్వలేదు. కేవలం రైతులకు అందించే సాయాన్ని మాత్రమే ప్రకటించి చేతులు దులుపుకున్నారు. వ్యవసాయంలో సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగిస్తున్నామని చెప్పుకునేందుకు 28 డ్రోన్లు ఏర్పాటు చేసి రైతులకు శిక్షణ అందించారు. నమో దీదీ కార్యక్రమంలో భాగంగా మహిళా స్వయం సహాయక సంఘాలకు కేవలం 6 డ్రోన్లు మాత్రమే అందించారు. దీంతో రాను రాను వరిసాగు తగ్గుముఖం పడుతున్న పరిస్థితి ఉంది. ఇంకా కౌలు రైతులు సాగుకు వెనకడుగు వేస్తున్నారు. భూమి లీజులు ఒక ప్రాంతంలో ఒకలా వేరే ప్రాంతాల్లో మరోలా ఉంది. మరికొన్ని చోట్ల కౌలు రేటు పెరిగిందని చెబుతున్నారు. వరిసాగు చేసే వారు లేక కౌలు రేటు తగ్గితే బాగా పండే చోట అధికంగా ఉందని తెలుస్తుంది. అయితే ఏడాది పాటు మొత్తం వ్యవసాయం చేస్తున్నా రూ.20 వేల ఆదాయం కూడా వచ్చే పరిస్థితి లేదని వాపోతున్నారు. దీనికి తోడు ప్రభుత్వ సహకారం లేకపోవడంతో రైతులు సాగుకు వెనకడుగు వేస్తున్నారు.

ఎకరానికి పెట్టుబడి ఖర్చులు ఇలా

నారుమడికి రూ.1,800, దమ్ముకు రూ.నాలుగు వేలు, గట్టులంకకు రూ.1,400, బాగుచేతకు రూ.1,400, నాట్లు వేయడానికి రూ.ఆరు వేలు, కలుపుతీతకు రూ.1,800, ఎరువులకు రూ.ఏడు వేలు, పురుగు మందులు రూ.6,800, మాసూలు కూలీలకు రూ.3,300, మాసూళ్లకు రూ.7,400 మొత్తం కలిపి ఆయా ప్రాంతాలను బట్టి రూ.35 వేల నుంచి రూ.40 వేల వరకూ పెట్టుబడి అవుతుంది.

భూ యజమానులతో సంబంధం లేకుండా కౌలు కార్డులివ్వాలి

మామిడిశెట్టి రామాంజనేయులు,
కౌలు రైతు సంఘం పశ్చిమ జిల్లా కార్యదర్శి

జిల్లాలో సుమారు 1.50 లక్షల మంది కౌలు రైతులు ఉన్నారు. దీనిలో కేవలం 92 వేల మందికి మాత్రమే కౌలు గుర్తింపు కార్డులు ఇచ్చారు. దీనిలో వందకు 30 శాతం కౌలు కార్డులు భూ యజమానుల చేతుల్లోనే ఉంటాయి. కౌలు రైతులకే కార్డులు అందిస్తున్నామని ప్రభుత్వం చెబుతుంది. దీనికి భూ యజమానులు ఒప్పుకోవడం లేదు. దీనిపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి. భూ యజమానులతో సంబంధం లేకుండా ఇ - పంటలో కౌలు రైతు పేరు నమోదు చేయాలి. వాస్తవ కౌలుదారులకు కార్డులు మంజూరు చేయాలి. సాగులో కౌలురైతులు ఆర్థికంగా అష్టకష్టాలు ఎదుర్కొంటున్నారు. గుర్తింపు కార్డులు ఇవ్వకపోవడంతో పంట నమోదు చేయనీయడం లేదు. రాయితీలన్నీ భూ యజమానులకు వర్తిస్తున్నాయి. కౌలురైతులకు తీవ్ర అన్యాయం జరుగుతోంది. ఎరువులు, పురుగు మందుల నకిలీలను అరికట్టాలి.

విఒఎల సమస్యలు పట్టకపోవడం దారుణం

ఉభయ గోదావరి జిల్లాల టీచర్ ఎంఎల్సి గోపీమూర్తి
రెండో రోజు కొనసాగిన విఒఎల రిలే నిరాహార దీక్షలు
డిఆర్ఒకు వినతి

ప్రజాశక్తి - భీమవరం

డిఆర్ఒకు వినతిపత్రం అందజేస్తున్న ఎంఎల్సి గోపీమూర్తి, విఒఎలు

విఒఎల సమస్యలను కూటమి ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమని ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి బి.గోపీమూర్తి అన్నారు. భీమవరం కలెక్టర్‌కు వెళ్లే మార్గంలో విస్సాకోడేరు పెద్దవంతెన దిగువున విఒఎలు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారం రెండో రోజు కొనసాగాయి. ఈ దీక్షా శిబిరాన్ని గోపీమూర్తి సందర్శించి విఒఎల ఉద్యమానికి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా గోపీమూర్తి మాట్లాడుతూ ప్రపంచ బ్యాంకు ఆదేశిత విధానాలను అమలు చేసే పాలకులు ప్రజలను పక్కనపెట్టి కార్పొరేట్లకు ఊడిగం చేసే పనిలో ఉన్నారని విమర్శించారు. విఒఎల సమస్యలను పరిష్కరించకుండా నిర్లక్ష్యం వహించడం ఎంతవరకూ సమంజసమని ప్రశ్నించారు. ఇది సరైంది కాదని, ప్రభుత్వం తీరు మార్చుకోవాలని తెలిపారు. అనంతరం విఒఎల ప్రతినిధి బృందంతో కలెక్టరేట్లోని జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వర్లను కలిసి సమస్యలను విన్నవించారు. అనంతరం వినతి పత్రాన్ని అందజేసి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు పాల్గొని దీక్షలకు సంఘీభావం తెలిపారు. విఒఎల జిల్లా అధ్యక్షురాలు నిర్మలాదేవి మాట్లాడుతూ ఇంతమంది మహిళలు డ్వాక్రా యానిమేటర్లు ఇక్కడ చేరి శాంతియుతంగా ఆందోళన చేస్తుంటే ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. కాల పరిమితి సర్క్యులర్ తీసుకొచ్చి విఒఎలపై ఒత్తిడి చేస్తున్నారని, రాజకీయ వేధింపులకు గురి చేస్తున్నారని తెలిపారు. సిఐటియు జిల్లా నాయకులు ఆంజనేయులు, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల హరేరామ్ దీక్షలకు సంఘీభావం తెలిపి మాట్లాడారు. విఒఎలు డ్వాక్రా గ్రూపులను ఏర్పాటు చేసి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు అందిస్తున్నారన్నారు. తక్షణం వారి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గోవిందమ్మ, పుష్పలత, జ్యోతిరత్నం, కె.పార్వతి, ఎన్.హేమలత, అమర, సుధారాణి పాల్గొన్నారు.

హెలీప్యాడ్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ నాగరాణి

31న సిఎం పెనుగొండ రాక

పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, ఎస్పి, జెసి

ప్రజాశక్తి - పెనుగొండ

పెనుగొండ నగరేశ్వర, మహిషాసురమర్దిని, వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం వద్ద ఈ నెల 31న నిర్వహించే వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాల్గొనున్నారు. ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లలో భాగంగా మంగళవారం కలెక్టర్ చదలవాడ నాగరాణి, జిల్లా ఎస్పి అద్నాన్ నయీం అస్మీ, జెసి రాహుల్ కుమార్ రెడ్డి తొలుత పెనుగొండ వ్యవసాయ మార్కెట్ యార్డు వద్ద హెలీపాడ్ ప్రాంతాన్ని పరిశీలించి ఆర్అండ్‌బి, మార్కెట్ యార్డు అధికారులకు పలు సూచనలు చేశారు. హెలీపాడ్‌ను పటిష్టపర్చడంతో పాటు, చుట్టుపక్కల ఉన్న పొదలను తొలగించి శుభ్రం చేయించాలని ఆదేశించారు. అనంతరం వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానాన్ని సందర్శించి నగరేశ్వర స్వామిని దర్శించుకున్నారు. వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కలెక్టర్, ఎస్పి, జెసికి శేష వస్త్రాలను వేసి వేద ఆశీర్వచనాలు చేశారు. ఆలయం మొత్తం పరిశీలించిన అనంతరం నిత్యాన్నదాన సత్రం ప్రాంగణంలో జనవరి 31న హోమం నిర్వహించే ప్రాంతాన్ని పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం శ్రీవాసవి ధామ్‌ను సందర్శించి 90 అడుగుల కన్యకా పరమేశ్వరి అమ్మవారి పంచలోహ విగ్రహాన్ని దర్శించుకున్నారు. ఆలయ సెక్రటరీతో కార్యక్రమ వివరాలపై చర్చించి పలు సూచనలు చేశారు. ఆమె వెంట ఎఎస్పి వి.భీమారావు, ఆర్‌డిఒ దాసిరాజు, డిఎస్పి శ్రీవేద, జిల్లా దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారి ఇవి.సుబ్బారావు, దేవాలయాల తనిఖీ అధికారులు ఉన్నారు.

లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి

ఫిబ్రవరి 5న దేశవ్యాప్త ఆందోళనలకు పిలుపు
సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ఉమామహేశ్వరరావు

ప్రజాశక్తి - భీమవరం

మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ఉమా మహేశ్వరరావు

లేబర్ కోడ్లు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఫిబ్రవరి 5న దేశవ్యాప్తంగా అన్ని మండలాల్లో ఆందోళన నిర్వహిస్తున్నట్లు సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె.ఉమా మహేశ్వరరావు తెలిపారు. సిఐటియు జిల్లా కౌన్సిల్ సమావేశం స్థానిక అంబేద్కర్ భవనంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి.గోపాలన్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ కార్మిక చట్టాలను కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా మార్చి లేబర్ కోడ్లుగా అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం చూస్తోందన్నారు. దీనివల్ల దేశంలో ఉద్యోగులు, కార్మికులు వారికున్న హక్కులను కోల్పోతారని తెలిపారు. పని గంటలు కనీస వేతనాలు ఇతర అనేక అంశాలతో పాటు యూనియన్ రిజిస్ట్రేషన్ కోసం ఇబ్బందులు పడే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. ఇప్పటికే పరిశ్రమల్లో అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని, వాటికి యాజమాన్యం బాధ్యత తీసుకోవడం లేదని పేర్కొన్నారు. ప్రభుత్వ పర్యవేక్షణ లేకపోవడం వల్ల, కార్మిక శాఖ నిర్వీర్యం కావడం వల్ల కార్మికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. కార్మికులతో సంబంధం లేకుండానే పరిశ్రమలు మూసివేస్తున్నారని తెలిపారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజా రామ్మోహన్ రాయ్ మాట్లాడుతూ ఇటీవల జరిగిన ఆందోళన పోరాటాలను, భవిష్యత్ కార్యాచరణను వివరించారు. వలస, రైస్ మిల్ కార్మికులు, ఆక్వారంగ కార్మికుల సమస్యలపై ఆందోళన కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలియజేశారు. ఈ సమావేశంలో బి.వాసుదేవరావు, కె.నాగేశ్వరరావు, పివి.ప్రతాప్, మండ సూరిబాబు, కె.ఝాన్సీలక్ష్మి, అజయ్‌కుమారి, కళ్యాణి, జ్యోతి, హసీనా, ఎం.ఆంజనేయులు, ఎస్.వెంకటేశ్వరరావు, జవ్వాది శ్రీనివాస్, టి.సత్యనారాయణ, ఎం.త్రిమూర్తులు, ఎస్.రంగారావు పాల్గొన్నారు.

నేడు జిల్లాకు విశాఖ స్టీల్ ప్లాంట్ పరిరక్షణ యాత్ర

ప్రజాశక్తి - భీమవరం

సిపిఎం రాష్ట్ర మహాసభల సందర్భంగా విశాఖ పట్టణం స్టీల్ ప్లాంట్ నుంచి నెల్లూరు వరకు చేపట్టిన విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ యాత్ర బుధవారం ఉదయం పెనుగొండ వద్ద జిల్లాలోకి ప్రవేశించనున్నట్లు సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ తెలిపారు. ఈమేరకు మంగళవారం ప్రకటన విడుదల చేశారు. ఈ యాత్రలో భాగంగా మార్టేరు సెంటర్లో సభ నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం అక్కడ నుంచి పాలకొల్లు-వీరవాసరం మీదుగా జిల్లా కేంద్రం భీమవరానికి సాయంత్రం ఐదు గంటలకు చేరుకుంటుందని, అనంతరం అక్కడ ప్రకాశం చౌక్ సెంటర్‌లో బహిరంగ సభ నిర్వహించనునట్లు తెలిపారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను కాపాడాలి, ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని చేసే ఈ యాత్రకు ప్రజానీకం అంతా వచ్చి స్వాగతం పలికి, తమ మద్దతు తెలియజేయాలన్నారు.

సిపిఎం జిల్లా కార్యదర్శి గోపాలన్

30న సిపిఎం విస్తృత సమావేశం

ఈనెల 30వ తేదీన సిపిఎం జిల్లా విస్తృతస్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు పార్టీ జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లావ్యాప్తంగా ప్రజలు ఎదుర్కొనే అనేక సమస్యలపై ఈ సమావేశంలో చర్చించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం హాజరుకానున్నట్లు తెలిపారు. ఈనెల 30వ తేదీన ఉదయం 10 గంటలకు సిపిఎం జిల్లా కార్యాలయం పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో ఈ విస్తృతస్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి జిల్లాలోని మండల, పట్టణ కమిటీల కార్యదర్శులు, కన్వీనర్లు, జిల్లా కమిటీ సభ్యులు హాజరు కానున్నట్లు తెలిపారు.

రాఘవులు విజయానికి కృషి చేయాలి

టీచర్స్ ఎంఎల్సి గోపీమూర్తి అభినందన సభలో వక్తల పిలుపు
అన్ని తరగతుల శ్రేయస్సు కోసం పిడిఎఫ్ ఎంఎల్సి నిరంతర పోరాటం : సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ఉమామహేశ్వరరావు



ఎంఎల్సి గోపీమూర్తికి మొక్క అందిస్తున్న సిఐటియు, ప్రజా సంఘాల నేతలు

ప్రజాశక్తి - భీమవరం

ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి బి.గోపీమూర్తి విజయానికి ఎంత అయితే శ్రమించామో అంతకుమించి ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సి అభ్యర్థి డివి రాఘవులు గెలుపుకు కృషిచేయాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. స్థానిక అంబేద్కర్ భవనంలో సిఐటియు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ ఎంఎల్‌సి గోపీమూర్తి అభినందన సభ మంగళవారం నిర్వహించారు. ఈ సభకు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజారామ్మోహన్ రాయ్ అధ్యక్షత వహించారు. ముఖ్యవక్తగా విచ్చేసిన సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు మాట్లాడారు. యుటిఎఫ్ పోరాటాల బాట అన్నారు. అక్కడ నుంచి వచ్చిన గోపీమూర్తి ఉద్యమాలే ఊపిరిగా నిరంతరం సమస్యల పరిష్కారానికి పోరాటం చేసి ఎంఎల్‌సిగా గెలుపొంది, తిరిగి పోరాటాలు సాగించడం అనేది ఒక్క పిడిఎఫ్ ఎంఎల్‌సిలకు మాత్రమే సాధ్యమవుతుందన్నారు. వారి స్వలాభం కోసం కాకుండా వారి జీవితాన్ని త్యాగం చేయడానికి పిడిఎఫ్ ఎంఎల్‌సిలు ఉద్యమాల్లోకి వచ్చారన్నారు. అన్ని వర్గాల శ్రేయస్సు కోసం పిడిఎఫ్ ఎంఎల్‌సిలు నిరంతరం పోరాటాలు సాగిస్తూనే ఉంటారని పేర్కొన్నారు. నమ్మకం, ఆదర్శం, విశ్వాసాలు పెంచే విధంగా ఎంఎల్‌సి పనిచేస్తారని చెప్పారు. కూటమి ప్రభుత్వం పెట్టుబడిదారులు, కార్పొరేట్లను వెతుక్కుంటూ వెళుతుందని, సంపద సృష్టించి అన్నం పెట్టే కార్మికవర్గాన్ని పట్టించుకోవట్లేదన్నారు. రానున్న రోజుల్లో అన్ని వర్గాల సమస్యల పరిష్కారానికి చేస్తున్న పోరాటాలు, అరెస్టులు, కేసులు ఎదురైనప్పటికీ పిడిఎఫ్ ఎంఎల్‌సిలు అండగా ఉంటారన్నది గుర్తుపెట్టుకోవాలన్నారు. మార్చిలో పట్టభద్రుడు ఎంఎల్‌సి ఎన్నికలు జరగనున్నాయని, ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సి అభ్యర్థిగా రాఘవులు పోటీలో ఉన్నారని, ఆయన గెలుపుకు ప్రతి ఒక్కరూ సహకారం అందించాలని కోరారు. టీచర్ ఎంఎల్‌సి గోపీమూర్తి మాట్లాడుతూ ప్రస్తుతం జరుగుతున్న సభ నా అభినందన సభ కాదని, నా గెలుపుకు సహకరించిన వారిని అభినందించే సభగా భావిస్తున్నానని తెలిపారు. శాసన మండలిలో అతి చిన్న వయసులో పెద్దల సభకు వెళ్లిన ఏకైక వ్యక్తిని తానే అన్నారు. రెండు రాష్ట్రాలలో ఎవరికి రాణి మెజారిటీ తనకు వచ్చిందని, ఈ విజయం ఉద్యమాల విజయమని, ప్రజాస్వామ్య విజయమని, రాజ్యాంగ విజయం అన్నారు. 12 ఏళ్ల ఉపాధ్యాయ సర్వీసును వదులుకున్నానని, దీనివల్ల సుమారు రూ.2 కోట్ల 50 లక్షల జీతాన్ని వ్యక్తిగతంగా కోల్పోయి ఉద్యమ బాట పట్టానన్నారు. కష్టపడి సాధించుకున్న ఉద్యోగాన్ని వదులుకోవడం సరైంది కాదని మా అమ్మ వాళ్ల దగ్గర వీళ్ల దగ్గర ఎంతో బాధపడిందని గుర్తు చేశారు. సమస్యల పరిష్కారానికి పిడిఎఫ్ ఎంఎల్‌సిలు నిరంతరం పోరాడుతూ ఉంటారని తెలిపారు. పోరాటాల ద్వారానే సమస్యలు పరిష్కారం అవుతాయని తెలిపారు. పట్టభద్రుల ఎంఎల్‌సి అభ్యర్థి రాఘవులు ఎన్నో ఏళ్ల నుంచి ఉద్యమాల్లో ఉన్నారని, అనేక పదవులు చేపట్టి సమస్యల పరిష్కారానికి కృషిచేస్తున్నారని, అటువంటి వ్యక్తికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించుకోవాల్సిన అవసరం మనందరిపై ఉందన్నారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి రాజా రామ్మోహన్ రాయ్ మాట్లాడుతూ గోపీమూర్తి విద్యార్థి ఉద్యమం నుంచి ఉపాధ్యాయ ఉద్యమం వరకు అనేక పోరాటాలు సాగించారని తెలిపారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పిఎస్ విజయరామరాజు మాట్లాడుతూ నాకు అత్యంత సన్నిహితులు మా బావ గోపీమూర్తి అని అన్నారు. ఒకే మండలంలో 23 ఏళ్లు పట్టు కలిసి ఉపాధ్యాయులుగా పని చేశామని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి.గోపాలన్, ఉపాధ్యక్షులు బి.వాసుదేవరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల హరేరామ్, కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు, శ్రామిక మహిళ జిల్లా కన్వీనర్ డి.కళ్యాణి, కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.క్రాంతి బాబు పాల్గొన్నారు.

తహశీల్దార్ కార్యాలయం ముట్టడి

అధికారులను నిలదీసిన ఎఎస్ఆర్ నగర్ వాసులు



తహశీల్దార్‌కు నోటీసులకు రిప్లై అందిస్తున్న పేదలు

పాలకోడేరు : పాలకోడేరు శివారు ఎఎస్ఆర్ నగర్ పేదలు తహశీల్దార్ కార్యాలయాన్ని మంగళవారం ముట్టడించారు. తమ గృహాలకు నోటీసులు ఎందుకు అంటించారంటూ అధికారులను నిలదీశారు. తహశీల్దార్ కార్యాలయం ఎదుట బయట నుంచి ప్రభుత్వానికి, అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఎఎస్ఆర్ నగర్ పేదలకు నాలుగు రోజుల క్రితం రెవెన్యూ, పంచాయతీ అధికారులు ఇళ్లను తొలగిస్తున్నట్లు నోటీసులు ఇచ్చే ప్రయత్నం చేయడంతో వాటిని తిరస్కరించారు. ఈ నేపథ్యంలో అధికారులు సంబంధిత నోటీసులను గృహాల తలుపులకు అంటించి వెనుతిరిగారు. ఈ నేపథ్యంలో అధికారులు తీసుకున్న చర్యలను వ్యతిరేకిస్తూ తహశీల్దార్ కార్యాలయాన్ని నోటీసులతో ముట్టడించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి శేషపు ఆశ్రీయ్యా మాట్లాడుతూ గత 40 ఏళ్ల నుంచి విషసర్పాలతో ప్రమాదకరమైన పరిస్థితుల్లో నిరుపేదలు జీవిస్తుంటే, కొంతమంది వ్యక్తుల ప్రయోజనాల కోసం ఖాళీ చేయించాలనుకోవడం దుర్మార్గమన్నారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే పేదల ఇల్లు అన్నిటికీ పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రీ సర్వే డిప్యూటీ తహశీల్దార్ సూర్యనారాయణకు వ్యక్తిగత రిప్లై నోటీసులు అందించారు. దీనిపై సూర్యనారాయణ రాజు మాట్లాడుతూ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బైరి ఆదిలక్ష్మి, పెచ్చెట్టి సత్యనారాయణ, వర్రి లక్ష్మి, జోగి సత్యనారాయణ, దున్న మరియమ్మ, తమ్మినేడి వెంకటరమణ, గుడాల లక్ష్మి, దొంగ నాగరాజు పాల్గొన్నారు.

మున్సిపల్ హైస్కూల్ తనిఖీ

ప్రజాశక్తి - నరసాపురం

ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్

టైలర్ పేట మున్సిపల్ హైస్కూల్‌ను మంగళవారం మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య ఆకస్మాత్తుగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థులు పేదరికం కారణంగా పాఠశాలకు వెళ్లడం మానివేయకూడదనే ఉద్దేశంతో, రాష్ట్ర ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకం అమలు చేయడం వల్ల విద్యార్థులకు ఉచితంగా భోజనం అందిస్తుందన్నారు. బాలబాలికలను ఆకలి బాధ నుంచి దూరం చేయడం, పాఠశాలలో చేరేవారి సంఖ్యను, హాజరు అయ్యేవారి సంఖ్యను పెంచడం, పిల్లల్లో సామాజిక సమ భావన పెంపొందించడం, పౌష్టికాహార లోపాన్ని తగ్గించడం ఈ పథకం ముఖ్య లక్ష్యాలు అన్నారు. పాఠశాలల అభివృద్ధి ఈ పథకం విజయానికి చక్కని తార్కాణమని అన్నారు. స్కూళ్లలో ఎక్కడ పారిశుధ్య లోపాలు రాకుండా చూసుకోవాలని చెప్పారు. అనంతరం స్కూల్ సిబ్బంది హాజరు పట్టి తనిఖీ చేశారు.

కుంభమేళ స్పెషల్ రైలును పొడిగించాలి

వీరవాసరం : ఉత్తరప్రదేశ్ ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న కుంభమేళకు నరసాపురం నుంచి బెనారస్‌కు ఏర్పాటు చేసిన ప్రత్యేక రైలును పొడిగించాలని రైల్వే పాసింజర్ అసోసియేషన్ రైల్వే ఉన్నతాధికారులను కోరింది. ఈమేరకు మంగళవారం అసోసియేషన్ ప్రెసిడెంట్ సబ్బావు వెంకట్రావు రైలును పొడిగించవలసిన అవసరాన్ని వివరిస్తూ ఉన్నతాధికారులకు లేఖ రాశారు. ఇప్పటికే కొనసాగుతున్న రెండు రైళ్లకు డిమాండ్ ఎక్కువగా ఉందని, వంద సంఖ్యలో ప్రయాణీకులు వెయిటింగ్ లిస్టులో ఉంటున్నారని పేర్కొన్నారు. నరసాపురం ప్రాంతం పరిసర ప్రాంతాల నుంచి కుంభమేళకు వెళ్లడానికి అనేక మంది ఆసక్తి చూపుతున్నారని, ప్రయాణీకుల డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని తక్షణమే మరిన్ని ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేసేందుకు రైల్వే అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

రహదారులకు మహర్దశ

తాడేపల్లిగూడెం : ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వ విప్, ఎంఎల్‌ఎ బొలిశెట్టి శ్రీనివాస్ చొరవతో తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో అత్యవసరమైన చోట కొత్త రహదారులు నిర్మించడం, పెద్ద పెద్ద గోతులు ఉన్నచోట ప్రత్యేక మరమ్మతులు చేస్తున్నారు. తాడేపల్లిగూడెం పట్టణానికి సమీప గ్రామాల నుంచి వివిధ పనుల నిమిత్తం వచ్చే విద్యార్థులు, చిరు వ్యాపారులు, భవన నిర్మాణ కూలీలు, దినసరి కూలీలు, రైతులు, నిత్యవసర వస్తువుల కొనుగోలు నిమిత్తం వచ్చేటువంటి ప్రజలు పడుతున్న ఇబ్బందులను చూసి మరమ్మతులు చేస్తున్నారు. ప్రాథిక్ హైలాండ్ నుంచి పద్మావతి జంక్షన్ వరకు ఐబు ఏలూరు రోడ్డు బాదంపూడి ఉత్తరం వరకు ఉన్న రోడ్లలో పెద్ద పెద్ద గుంతలను కూడా పూడ్చివేసిందిగా వాహనదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

మార్టేరులో ఆక్యుప్రెజర్ వైద్య శిబిరం

పెనుమంట్ర : ఎన్నికలలో మార్టేరులో గడిచిన నాలుగు రోజులుగా సాగుతున్న ఆక్యుప్రెజర్ ఉచిత వైద్య శిబిరంలో 120 మంది నమోదై, సేవల్ని పొందుతున్నారని నిర్వాహకులు ఖండవల్లి కిషోర్ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు సత్తి సుబ్బన్న రెడ్డి, మనవత మండల శాఖ అధ్యక్షులు కర్రి కృష్ణారెడ్డి మంగళవారం తెలిపారు. కిషోర్ అకాడమీ ఆఫ్ ఆక్యుపెజర్ సైన్స్(జోధ్‌పూర్) వైద్యులైన థెరపిస్టులు డాక్టర్ తాన్‌రాజ్ చౌదరి, డాక్టర్ రేవంత్ చౌదరి శిబిరంలో ప్రతీ రోజు ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు తమ సేవల్ని అందించడం విశేషం. ఈ శిబిరం ఈ నెల 30 వరకు కొనసాగుతుందని వారు అన్నారు. ట్రస్టు ప్రతినిధులతో పాటు, మార్టేరు గ్రామ ఉప సర్పంచ్ కర్రి వేణుబాబు, మానవత కార్యవర్గం కొత్త సత్యనారాయణ మూర్తి, జి.నరేంద్ర, బండి ప్రసాద్, సి.హెచ్.రెడ్డి తమ సహకారం అందిస్తున్నారు.

నేడు ఎంఎల్‌సి ఎన్నికలపై అవగాహన

పెనుమంట్ర : ఈనెల 29వ తేదీ బుధవారం మధ్యాహ్నం 2.30 నిమిషాలకు మార్టేరు శ్రీవేణుగోపాల ఆడిటోరియం వేదికగా రానున్న ఎంఎల్‌సి ఎన్నికల అవగాహన సమావేశం జరుగుతుందని స్థానిక కూటమి నాయకులు తెలిపారు. ఈ సమావేశం మాజీ మంత్రి, ఆచంట ఎంఎల్‌ఎ పితాని సత్యనారాయణ ఆధ్వర్యంలో జరుగుతుందని, నియోజకవర్గంలోని పెనుమంట్ర, ఆచంట, పెనుగొండ, పోడూరు మండలాలకు చెందిన కూటమి నేతలు పాల్గొనాలని కోరారు.

ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి

డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణరాజు

కాళ్ల : నియోజకవర్గంలో నీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని డిప్యూటీ స్పీకర్, ఉండి ఎంఎల్‌ఎ కనుమూరు రఘురామకృష్ణరాజు అన్నారు. పెదఅమిరం గ్రామంలోని ఎంఎల్‌ఎ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో మంగళవారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. వచ్చే వేసవికాలంలో నీటి ఎద్దడి కలుగకుండా ముందస్తు ప్రణాళికలు చేయాలని సూచించారు. ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యుఎస్, ఫిషరీస్ శాఖల అధికారులు, వాటర్ డిస్ట్రిబ్యూషన్ చైర్మన్లు, వివిధ గ్రామాల నీటి సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.

గీత కార్మికులకు మద్యం షాపుల దరఖాస్తుల స్వీకరణ

తాడేపల్లిగూడెం : తాడేపల్లిగూడెం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో గీత కార్మికులకు కేటాయించబడిన మద్యం షాపులకు ఈనెల 27వ తేదీ నుంచి ఫిబ్రవరి 5వ తేదీ సాయంత్రం ఐదు గంటల లోపు దరఖాస్తులు స్వీకరించబడునని తాడేపల్లిగూడెం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ హౌస్ స్టేషన్ ఆఫీసర్ మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. షాపు వివరాలు తాడేపల్లిగూడెం మున్సిపాలిటీ1(గౌడ్), అత్తిలి 1 (శ్రీయన), గణపవరం 1(గౌడ్), తాడేపల్లిగూడెం రూరల్ 1(గౌడ) కేటాయించినట్లు తెలిపారు. దరఖాస్తు ఆన్‌లైన్‌లో నింపి, రుసుమును కూడా ఆన్‌లైన్‌లోనే చెల్లించవచ్చునని లేదా తాడేపల్లిగూడెం, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్‌కు డిడి లేదా చలానా తీసుకొని వచ్చి స్టేషన్‌లో కంప్యూటర్ ద్వారా దరఖాస్తు చేసుకోగలరని సూచించారు. ఒక్కొక్క దరఖాస్తుకు రెండు లక్షలు అందజేయాల్సి ఉంటుంది. ఒక దరఖాస్తుదారుడు ఒక షాపుకు ఎన్ని దరఖాస్తులు అయినా చేయవచ్చునని, ఎన్ని షాపులకైనా, ఎన్ని దరఖాస్తులైన చేయవచ్చునని తెలిపారు. ఒక షాపు లాటరీలో తగిలిన యెడల తదుపరి షాపులకు అర్హత ఉండదని, దరఖాస్తు రుసుము వెనక్కు తిరిగి ఇవ్వబడదని తెలిపారు. దరఖాస్తు దారు వారి కుల ధ్రువీకరణ సర్టిఫికెట్ సంబంధిత తహశీల్దార్ వద్ద నుంచి తీసుకొని దరఖాస్తుతో పాటు సమర్పించవలెనన్నారు.

1 నుంచి పాలిథిన్, ప్లాస్టిక్ వాడకం నిషేధం

ఆకివీడు : మండల కేంద్రం నగర పంచాయతీ ఆకివీడులో ఈనెల 1వ తేదీ నుంచి జిల్లా కలెక్టర్ నాగరాణి ఆదేశాల మేరకు ప్లాస్టిక్, పాలిథిన్ వాడకాన్ని నిషేధిస్తున్నామని నగర పంచాయతీ కమిషనర్ ఎ.కృష్ణమోహన్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈరోజు నుంచే పట్టణంలోని ప్రధాన కూడలి కేంద్రాలలో, హోల్‌సేల్ దుకాణాలలో ప్రత్యక్షంగా తెలియజేస్తామని ఆయన చెప్పారు. 120 మైక్రాన్ల కన్నా తక్కువ మందం కలిగిన పాలిథిన్ కవర్లు, ఇతర పాలిథిన్ వస్తువులు, ప్లాస్టిక్ కాగితాల కప్పులు, మంచినీటికి కాఫీ హోటల్స్‌లోని, క్యాంటీన్ వినియోగించే కాఫీ, టీ, మంచినీరు తాగే ప్లాస్టిక్, కాగితం కప్పులు, గ్లాసుల ఈ నిషేధం కిందికి వస్తాయన్నారు. కళ్యాణ మండపాలు, ఇతర ఫంక్షన్ కేంద్రాల సెంటర్లలో, రెస్టారెంట్ల వద్ద చిల్లర దుకాణాలు, కూరగాయల దుకాణాల వద్ద ఈ పాలిథిన్ వినియోగం వెంటనే ఆపేయాలని ఆయన సూచించారు. ముందుగా ప్రచారం చేస్తామని, ఈ నిషేధం ఒకటో తేదీ నుంచి అమల్లోకి వస్తుందని, రెండో తేదీ నుంచి ఈ రకమైన కవర్లు, కాగితాలు అమ్మినవారికీ, కొన్నవారికి, ఇరువురికి వారికి జరిమానాలు విధిస్తామని చెప్పారు. ఆమేరకు పట్టణంలో మైక్ ప్రచారం, వ్యక్తిగత ప్రచారం నిర్వహిస్తున్నామన్నారు.

మెడికల్ డిజెబులిటి పెన్షన్ల పరిశీలన

గణపవరం : మండలంలో అన్ని గ్రామాల్లో 28, 29, 30 తేదీలలో మూడురోజుల పాటు మెడికల్ డిజెబులిటీ పెన్షన్ల పరిశీలిస్తున్నట్లు గణపవరం ఎంపిడిఒ ఆర్.బేబీ శ్రీలక్ష్మి మంగళవారం సాయంత్రం తెలిపారు. మంగళవారం కొమర్రు, ముప్పర్తిపాడు, పిప్పర, వల్లూరు, వాకపల్లి గ్రామాల్లో ప్రభుత్వం నియమించిన గణపవరం డాక్టర్ పి.సంతోష్ ఆధ్వర్యంలో పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు రవికుమార్, నరసాపురం ఏరియా ఆసుపత్రి ఆర్థో డాక్టర్ డి.సుహాసిని పాల్గొన్నారు.

నట్టల నివారణా మందు పంపిణీ

ప్రజాశక్తి - గణపవరం


తణుకురూరల్‌లో..

పాడి పశువులకు ఆరు నెలలకు ఒకసారి నట్టల నివారణా మందు వేయాలని వెటర్నరీ గణపవరం అసిస్టెంట్ డైరెక్టర్ డి.ఎం.నాయక్ అన్నారు. మంగళవారం వాకపల్లిలో ఏర్పాటు చేసిన ఉచిత పశు వైద్య శిబిరంలో పాల్గొని మాట్లాడారు. పశువైద్యశిబిరాన్ని గ్రామ సర్పంచి అడిమాల శ్రీనివాసరావు ప్రారంభించారు. వైద్యశిబిరంలో చూడి పశువులు, గర్భకోశ వ్యాధుల మందులు అందజేశారు. జంతు సంక్షేమ సంఘం సభ్యులు గరిక కొండరాజు మాట్లాడుతూ 1960 యాక్టు ప్రకారం జంతువులను హింసించడం చట్టరీత్యా నేరమని అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్ శ్రీనివాసరావు మాట్లాడుతూ పశువైద్యశిబిరాలు ఉపయోగించుకోవాలని అన్నారు. బి.నాగజ్యోతి, జూనియర్ వెటర్నరీ ఆఫీసర్ ఐ.సురేష్ కుమార్, రైతులు పాల్గొన్నారు.

తణుకు రూరల్ : పశువులకు క్రమం తప్పకుండా వ్యాక్సిన్ వేయించుకోవడం ద్వారా రోగాలు సంక్రమించకుండా నివారించుకోవచ్చని రేలంగి పశు వైద్యశాల అధికారి పివిఎస్‌వి.ప్రసాద్ సూచించారు. ఇరగవరం మండలం కావలిపురం గ్రామంలో మంగళవారం పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా కోళ్లకు, మేకలకు, గొర్రెలకు, పశువులకు పాముల మందులు వేశారు. ఈ శిబిరం ద్వారా 76 పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. పశువుల యజమానులకు మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి స్వామి, పశుసంవర్ధక సహాయకులు పి.ఖాన, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్కులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్కులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

అంగన్‌వాడీ వర్కర్‌కు జాతీయ అవార్డు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

గౌరీ పార్వతి

స్థానిక 17వ వార్డుకు చెందిన అంగన్వాడీ వర్కర్ గౌరీ పార్వతికి జాతీయ ఉత్తమ అంగన్వాడీ వర్కర్ అవార్డును సెంట్రల్ మినిస్టర్ మహిళా శిశుసంక్షేమ శాఖ వారి చేతుల మీదుగా రిపబ్లిక్ డే రోజున న్యూఢిల్లీలో అందుకున్నారు. రాష్ట్రం మొత్తంలో 13 మందిని ప్రపోజల్స్ పంపగా వారిలో ఐదుగురు మాత్రమే సెలెక్ట్ చేశారని, ఆ ఐదుగురిలో పశ్చిమగోదావరి జిల్లా నుంచి తాడేపల్లిగూడెం ఐసిడిఎస్ ప్రాజెక్టు, తాడేపల్లిగూడెం 1 సెక్టార్ కి చెందిన 17వ వార్డు 1 అంగన్వాడీ టీచర్‌కి రావడం గర్వకారణమని సిడిపిఒ టిఎల్.సరస్వతి మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. అవార్డు గ్రహీత గౌరీ పార్వతికి తాడేపల్లిగూడెం సిడిపిఒ, సెక్టర్ సూపర్వైజర్ సిహెచ్.దుర్గ భవాని శుభాకాంక్షలు తెలియజేశారు.

పది ఫలితాల్లో నూరు శాతం సాధనే లక్ష్యం

తణుకు డివైఇఒ మురళీ సత్యనారాయణ

పెనుమంట్ర : ఈ విద్యా సంవత్సరంలో జరిగే టెన్త్ పరీక్షల్లో మండలంలోని అన్ని ఉన్నత పాఠశాలల విద్యార్థులు నూరు శాతం ఫలితాలు సాధించేలా విద్య అందించాలని విద్యాశాఖ తణుకు డివిజన్ డివైఇఒ డి.మురళీ సత్యనారాయణ అన్నారు. మంగళవారం మండలకేంద్రం పెనుమంట్రలోని రామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన మండల స్థాయి టెన్త్ విద్యా సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. వెనుకబడిన విద్యార్థులకు తగిన శిక్షణ ఇచ్చి, ప్రతీ సబ్జెక్ట్‌లో వారికి ఉన్న సందేహాలు తీర్చి, వారు మంచి మార్కులతో పాస్ అయ్యేలా ప్రధానోపాధ్యాయులు, సబ్జెక్ట్ టీచర్లు శ్రద్ధ తీసుకోవాలని ఆయన కోరారు. ప్రస్తుతం పరీక్షలు జరిగే సమయం దగ్గర పడుతున్నందున, ప్రతీ రోజు ప్రణాళిక ప్రకారం సిలబస్ విద్యార్థులకు ఉత్తమ ఫలితాల కోసం శిక్షణ ఇవ్వాలని సూచించారు. ఈ సమావేశంలో స్థానిక ఎంఇఒలు వై.లక్ష్మీ నారాయణ, యు.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సమగ్రాభివృద్ధి ప్రణాళికపై శిక్షణ

ఉండి : అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తేనే గ్రామాభివృద్ధి సాధ్యమవుతుందని ఉండి మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎస్.రవీంద్ర అన్నారు. గ్రామ పంచాయతీల సమగ్రాభివృద్ధి ప్రణాళికపై ఒకరోజు శిక్షణా కార్యక్రమాన్ని మండల పరిషత్ కార్యాలయంలో మండల విస్తరణాధికారి చల్లా సుదర్శన వెంకటరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపిడిఒ ఎస్.రవీంద్ర మాట్లాడుతూ మండలంలో ఉన్న అన్ని గ్రామ పంచాయతీలలో 2025-26 సంవత్సరానికి సంబంధించి గ్రామ సమగ్ర అభివృద్ధి కోసం స్థానిక ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు సమన్వయంతో పనులను ఎంపిక చేసి అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. పంచాయితీలకు వచ్చే నిధులను పూర్తి ప్రణాళికాబద్ధంగా ఖర్చు చేయాలన్నారు. ఇందుకు ప్రభుత్వం నిధుల కోసం ప్రవేశపెట్టిన ప్లాన్‌ను ప్రతి ఏటా అప్రూవల్ చేయించుకుంటూ దానికి అనుగుణంగా నడుచుకోవాలన్నారు. మండలంలోని సర్పంచ్లు, ఎంపిటిసిలు, గ్రామపంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ విలువలను తగ్గించాలని వినతి

భీమవరం టౌన్ : భీమవరం పట్టణంలో భూములు, స్థిరాస్తులు రిజిస్ట్రేషన్ విలువలు చాలా అధికంగా ఉన్నాయని, భూములు, స్థిరాస్తులు రిజిస్ట్రేషన్ విలువల పెంపుదల నుంచి మినహాయింపు చేయాలని ది భీమవరం ఛాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యులు ఎంఎల్‌ఎ అంజిబాబును కోరారు. మంగళవారం ఎంఎల్‌ఎ క్యాంప్ కార్యాలయంలో వినతిపత్రాన్ని అందించారు. కామర్స్ సభ్యులు మాట్లాడుతూ భీమవరం జిల్లా కేంద్రంగా ప్రకటించినప్పటి నుంచి ప్రత్యేకంగా రిజిస్ట్రేషన్ విలువలు అత్యధికంగా పెరిగాయని, ప్రస్తుతం భీమవరం పట్టణ పరిసర ప్రాంతముల వారికి ఆదాయ వనరులైన వ్యవసాయం, ఆక్వా తీవ్రమైన ఒడిదుడుకులతో నష్టపోయి ఉన్నాయని, అదిగాక రిజిస్ట్రేషన్ విలువలు పెరిగినందున ఆస్థి పన్నులు పెరిగిపోయాయని, రిజిస్ట్రేషన్ విలువలు పెరిగినందున రియల్ ఎస్టేట్ రంగం కూడా దెబ్బతిందని మినహాయింపు ఇవ్వాలని కోరారు. సభ్యులు మానేపల్లి సూర్యనారాయణ గుప్తా, కాగిత వెంకటరమణ, తుమ్మలపల్లి శివ, బుజ్జి పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్యంపై అవగాహన

గణపవరం : గణపవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం మానసిక ఆరోగంపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మానసిక ఆరోగ్య నిపుణులు డాక్టర్ శంకర్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి చిన్న విషయానికి ఒత్తిడికి గురికాకుండా దురలవాట్లను మానుకొనేందుకు ప్రతి సోమవారం, బుధవారం భీమవరంలో ఉన్న ఏరియా ఆసుపత్రికి వస్తే ఉచితంగా మందులు ఇచ్చి కౌన్సెలింగ్ ఇస్తామని చెప్పారు. అతిగా మాట్లాడడం, తనలో తాను మాట్లాడుకోవటం, నవ్వుకోవటం, అనుమానం, విపరీత ప్రవర్తనకు నిద్రలేమి, మైగ్రేన్ తలనొప్పికి వైద్యం అదించటం జరుగునని చెప్పారు. నిరాశ, ఆత్మహత్య ప్రయత్నం నివారణకు కౌన్సెలింగ్ ఇస్తామని అన్నారు. సోషల్ వర్కర్ సుమన్ బాబు మాట్లాడుతూ వైద్యం కోసం దూర ప్రాంతాల నుంచి వచ్చేవారు 11416 అనే టోల్ ఫ్రీ నెంబరుకి కాల్ చేస్తే వారికి సంబంధించిన విషయాలును తెలియజేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక డాక్టర్ పి.సంతోష్, సిహెచ్ఒ జాలాది విల్సన్ బాబు, ఎఎన్ఎంలు పాల్గొన్నారు.

ప్రయివేట్ మేనేజ్మెంట్ వైస్ ప్రెసిడెంట్‌గా బ్రహ్మాజీ

నరసాపురం : ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల ఆదికవి నన్నయ యూనివర్శిటీ రాజమహేంద్రవరం అనుబంధ డిగ్రీ కళాశాలల ప్రయివేట్ మేనేజ్మెంట్ తరపున వైస్ ప్రెసిడెంట్‌గా నరసాపురం శ్రీసూర్య విద్యాసంస్థల అధినేత ఘంటసాల బ్రహ్మాజీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా మంగళవారం కళాశాలలో కాలేజీ యాజమాన్యం పుష్పగుచ్చం అందజేసి, శాలువతో సత్కరించారు. అనంతరం ఘంటసాల బ్రహ్మాజీ మాట్లాడుతూ డిగ్రీ కళాశాలలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానన్నారు.

జెడ్‌పి హైస్కూల్ తనిఖీ

పాలకొల్లు రూరల్: మండలంలోని శివదేవుని చిక్కాల జిల్లా పరిషత్ హైస్కూల్‌లో మంగళవారం అధికారులు కె.రామకృష్ణ, టి.మార్రెడ్డి సామాజిక తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీలలో భాగంగా పాఠశాలలో పరిశుభ్రత, మధ్యాహ్న భోజనం, టాయిలెట్స్ నిర్వహణ ఇలాంటి వాటిని పరిశీలించారు. విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేసి విద్యార్థుల అభివృద్ధి, క్రమశిక్షణ, వారి నైపుణ్యాలను ఎలా పెంచుకోవాలి అనే అంశాలపై ఉపాధ్యాయులకు, విద్యార్థుల తల్లిదండ్రులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. ప్రధానోపాధ్యాయులు పి.రాము, ఉపాధ్యాయులు విఎస్ఎన్.మూర్తి, విద్యా కమిటీ వైస్ ఛైర్మన్ తాడిచెట్టు బాబు పాల్గొన్నారు.

రీ సర్వే పారదర్శకంగా నిర్వహించాలి

మొగల్తూరు : రీ సర్వేను పారదర్శకంగా నిర్వహించాలని తహశీల్దార్ కె.రాజకిషోర్ సిబ్బందికి సూచించారు. మండలంలోని కేపీ పాలెంలో నిర్వహిస్తున్న రీసర్వేను మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బందికి పరిశోధన చేశారు. రీ సర్వే పనులు వేగంగా జరుగుతున్నాయని తహశీల్దార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో విఆర్ఒలు వెంకన్నబాబు, దుర్గారావు, సచివాలయ సర్వేయర్ బొబ్బిలి శ్రీనివాస్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

లభ్యత బట్టి ఎరువులు వాడుకోవాలి

ప్రజాశక్తి - తణుకు రూరల్

ఎరువుల లభ్యత ఆధారంగా రైతులు ఎరువులు వినియోగించుకునేలా అవగాహన కల్పించాలని జిల్లా వ్యవసాయ అధికారి జెడ్ వెంకటేశ్వరరావు సూచించారు. మంగళవారం మండపాక గ్రామంలోని రైతు సేవా కేంద్రం వ్యవసాయ సహాయకులకు ఇ క్రాప్, ఎన్‌పిఎస్ఎస్, సిఎల్ఎస్ యాప్‌ల వినియోగంపై అవగాహన కల్పించారు. అనంతరం వరి పొలాలను పరిశీలించారు. కాంప్లెక్స్ ఎరువులు లేనప్పుడు సూటి ఎరువులు వాడుకోవాలని రైతులకు సూచించారు. వరి పంటల పరిస్థితి నారుమళ్లు ఎంతవరకు వేశారు అనేది అడిగి తెలుసుకున్నారు. సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు, ఊడ్పు మిషన్లు అందించాలని రైతులు కోరారు. ఎఒ టెక్నికల్ బి.ప్రియదర్శిని, గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

మౌలిక సౌకర్యాలు కల్పించాలని వినతి

ప్రజాశక్తి - పెనుగొండ

తహశీల్దార్‌కు వినతిని అందిస్తున్న వ్యకాస నేతలు

దళితవాడలో కనీస మౌలిక సౌకర్యాలు కల్పించాలని తహశీల్దార్ అనితకుమారికి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు షేక్ బాదుషా మాట్లాడుతూ పెనుగొండ చివరి బాపూజీ పురంలో దళిత కాలనీలో సుమారు 20 కుటుంబాలు నివసిస్తున్నాయన్నారు. వీరికి పంచాయతీ నుంచి మంచినీరు, వీధిలైట్లు, రేషన్ బియ్యం వాహనం, 104 ఆరోగ్య వాహనం, డ్రెయినేజీ సౌకర్యం, రహదారులు ఇబ్బందులు పడుతున్నారని, అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు కూడా ఇవ్వడం లేదని, ఒక ఇంట్లో పదిమందిపైనే జీవనోపాధి గడుపుతున్నారన్నారు. జాతీయ ఉపాధి పనులు సంవత్సరం 30 రోజులే అని చెప్పారని, సంవత్సరానికి 200 రోజులు జాతీయ ఉపాధి పనులు చెప్పాలన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో మాదాస్ నాగేశ్వరావు, నేలకు ఆదినారాయణ, సలాది యేసు, మహేంద్ర, వెంకటేష్, కాలనీ వాసులు టి.ఆశీర్వాదం, డి.మాణిక్యం పాల్గొన్నారు.

బిన్నీబాబుకు ఉత్తమ సేవా పురస్కారం

అవార్డు అందుకుంటున్న బిన్నీబాబు

ప్రజాశక్తి - వీరవాసరం

వీరవాసరం మండల వ్యవసాయాధికారిణిగా పనిచేస్తున్న బిన్నీబాబు ఉత్తమ సేవా పురస్కారం అందుకున్నారు. ఈనెల 26వ తేదీన భీమవరం రిపబ్లిక్‌డే రోజును కలక్టర్ నాగరాణి చేతుల మీదుగా ఆమె ఈ పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ఆమెను ఎంపిపి వీరవల్లి దుర్గాభవాణి, జెడ్‌పిటిసి గుండా జయప్రకాష్ నాయుడు మంగళవారం అభినందించారు. ఆమె వీరవాసరం మండలంలో వ్యవయాధికారిణిగా బాధ్యతలు చేపట్టిన అనతికాలంలోనే ఆమె తన శాఖలో విశేషమైన సేవలందించినందుకుగాను ఈ పురస్కారానికి ఎంపికైంది. ఈ పురస్కారంతో తాను మరింత బాధ్యతతో విధులు నిర్వర్తిస్తానని ఆమె ప్రజాశక్తితో తెలిపారు.

క్రమశిక్షణకు మారుపేరు ఎన్‌సిసి

ప్రజాశక్తి - భీమవరం టౌన్

ఎంఎల్‌ఎ అంజిబాబు


అవార్డు అందుకుంటున్న ఎన్‌సిసి క్యాడెట్లు

ఎన్‌సిసి క్రమశిక్షణకు మారుపేరని, దేశభక్తిని ప్రేరేపిస్తూ సమాజంలో ప్రజారక్షణ బందోబస్తులో కూడా ఎన్‌సిసి క్యాడెట్లు అందిస్తున్న సేవలు అద్వితీయమని ఎంఎల్‌ఎ పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) అన్నారు. విజయవాడలో జరిగిన గణతంత్ర దినోత్సవ వేడుకలలో ముగ్గురు భీమవరం ఎన్‌సిసి క్యాడెట్లు బి.లీలా శంకర, బి.రాంబాబు, సిహెచ్.వంశీలను మంగళవారం ఎంఎల్‌ఎ అంజిబాబు అభినందించి ప్రశంసా పత్రాలు అందజేశారు. భీమవరం డిఎన్ఆర్ కళాశాలలోని ఎన్‌సిసి క్యాడెట్లు అనేక మార్లు ప్రభుత్వం ద్వారా గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొన్నారని, ఈ ఏడాది కూడా ముగ్గురు ఎన్‌సిసి క్యాడెట్లు పాల్గొని ప్రతిభా అవార్డులను అందుకోవడం ప్రశంసానీయమని ఎంఎల్‌ఎ అంజిబాబు అన్నారు. మేజర్ డాక్టర్ వీరయ్య, చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ స్థాయిలో రెండు కేటగిరిలో ముగ్గురు ఎన్‌సిసి క్యాడెట్లు ప్రభుత్వ అవార్డులు సాధించారని తెలిపారు.

రాంబాబుకు బెస్ట్ ఎంప్లాయ్ అవార్డు

ప్రజాశక్తి - ఆచంట

అవార్డు అందుకుంటున్న రాంబాబు

76వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఎన్‌టిఆర్ వైద్య సేవా జిల్లా బెస్ట్ ఎంప్లాయ్ అవార్డును వల్లూరు గ్రామానికి చెందిన డాక్టర్ ఎన్‌టిఆర్ వైద్య సేవా డివిజనల్ టీం లీడర్ చిట్టూరి రాంబాబు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి చేతుల మీదగా ప్రశంసాపత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా పలువురు నేతలు, ప్రజాప్రతినిధులు, గ్రామప్రముఖులు అభినందించారు.

ఘనంగా నేషనల్ జియోగ్రాఫిక్ డే

విద్యార్థులను అభినందిస్తున్న అధ్యాపకులు

ప్రజాశక్తి - భీమవరం

స్థానిక ఆదిత్య స్కూల్లో సోమవారం స్కూల్, వాసవి క్లబ్ భీమవరం ఆధ్వర్యంలో నేషనల్ జియోగ్రాఫిక్ డే ఘనంగా నిర్వహించినట్లు స్కూల్ డైరెక్టర్ డాక్టర్ లయన్ కృష్ణంరాజు తెలిపారు. ఈ సందర్భంగా కృష్ణంరాజు మాట్లాడుతూ నేషనల్ జియోగ్రాఫిక్ మ్యాగజైన్ 1888 నేషనల్ జియోగ్రాఫిక్ సొసైటీ స్థాపించిందని తెలిపారు. దీని ముఖ్య ఉద్దేశం భౌగోళిక శాస్త్రం గురించి సమాచారాన్ని వ్యాప్తి చేసి, పర్యావరణం మీద అందరికీ అవగాహన కలిపి, భవిష్యత్ తరాలకు ఆనందం, ఆరోగ్యంగా జీవిస్తారని అన్నారు. స్కూల్ ప్రిన్సిపల్ టి.శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో పర్యావరణ విపత్తులు, సునామి, భూకంపాలు, అమెరికాలో ప్రస్తుతం జరుగుతున్న అగ్ని కారు చిచ్చు లాంటివి జరగకుండా జియోగ్రాఫిక్ బ్యాలెన్స్ ఎంతో అవసరం విద్యార్థులకు సూచించారు. వాసవి క్లబ్ ప్రెసిడెంట్ వెంకట త్రివిక్రమరావు మాట్లాడుతూ వాసవి క్లబ్ భీమవరం ఎన్నో సామాజిక సేవ కార్యక్రమాలు చేస్తుందని, సమాజంలో ఏదైనా మార్పు సాధించాలంటే అది విద్యార్థులతోనే సాధ్యమని తెలిపారు. పర్యావరణంపై అవగాహన కల్పిస్తూ విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో బి.యుగ సుధా, మహాలక్ష్మి, పద్మావతి, వాసవి క్లబ్ ప్రెసిడెంట్ త్రినాధరావు పాల్గొన్నారు.

ప్రకాశం పంతులు విగ్రహాన్ని నెలకొల్పాలి

ప్రజాశక్తి - భీమవరం టౌన్

మహాత్మాగాంధీ వర్ధంతి కార్యక్రమాలలో భాగంగా జిల్లా సర్వోదయ మండలి, శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో మంగళవారం ప్రకాశం చౌక్ సెంటర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ప్రకాశం పంతులు విగ్రహాన్ని భీమవరంలో నెలకొల్పాలని వక్తలు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు ఇందుకూరి సుబ్రహ్మణ్య రాజు, జిల్లా సర్వోదయ మండలి కార్యదర్శి ఇందుకూరి ప్రసాద్ రాజు మాట్లాడుతూ ఆనాటి త్యాగధనులను భావితరాలకు తెలియజేసేలా, ఆ మహనీయుల ఆశయాలు గుర్తు చేసుకోవాలని, మహాత్మాగాంధీ అడుగు జాడల్లో నడిచి ఆనాడే పాదయాత్ర చేసిన టంగుటూరి ప్రకాశం పంతులు విగ్రహాన్ని భీమవరం ప్రకాశం చౌక్‌లో ఏర్పాటు చేయడానికి ఎంఎల్‌ఎ అంజిబాబు సహకారంతో కృషి చేస్తున్నామని అన్నారు. ప్రజానాట్యమండలి సభ్యులు ఎస్‌కె.చాన్ భాషా మాట్లాడుతూ ప్రకాశం పంతులు తొలి ముఖ్యమంత్రిగా చేశారని, అటువంటి వారి విగ్రహాన్ని వెంటనే నెలకొల్పాలని కోరారు. కన్వీనర్ చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ 9 దశాబ్దాల నాడు ఇదే ప్రాంతంలో ప్రకాశం పంతులు జెండా ఎగురవేశారని, ఆయన విగ్రహాన్ని ఈ ప్రాంతంలో ఏర్పాటు చేయాలని కోరుతున్నామన్నారు. అనంతరం సర్ సివి రామన్ స్కూల్‌లో గాంధీజీ ఆశయాలపై పోటీలను నిర్వహించామని, 30న బహుమతులు అందజేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపల్ పెండ్యాల సరిత, పెన్మెత్స సత్యనారాయణ రాజు పాల్గొన్నారు.

అంతర్ జిల్లా దొంగలు అరెస్ట్

166.5 గ్రాముల బంగారం, 5 మోటార్ సైకిల్ స్వాధీనం : ఎస్‌పి

భీమవరం టౌన్ : ఒంటరిగా ఉన్న వృద్ధ మహిళలను లక్ష్యంగా చేసుకుని బంగారం గొలుసులు దొంగిలిస్తున్న ఇద్దరు వ్యక్తులను, కొనుగోలు చేసిన మరో వ్యక్తిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి 166.5 బంగారం, ఐదు మోటర్ సైకిల్లు, రూ.2,58 వేల అకౌంట్లో ఉన్న నగదు స్వాధీనం చేసినట్లు జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీం అస్మి తెలిపారు. వీటి విలువ సుమారు రూ.13 లక్షల 38 వేలు ఉంటుందన్నారు. మంగళవారం స్థానిక వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చోరీకి సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఇటీవల కాళ్ల మండలం సీసలి గ్రామంలో ముగ్గుల నరసింహారావు ఇంటిలో దొంగతనం జరగడంతో ఇంటి యజమాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన ఎస్ఐ శ్రీనివాస్ కేసు దర్యాప్తు ప్రారంభించారు. దీంతో కాళ్ల మండలంలో సీసలి గ్రామంలో సాయిబాబా గుడి వద్ద అత్తిలి మండలం వృధాల పాలెంకి చెందిన జొన్నల వెంకటేష్, కాళ్ల మండలం బొండాడ పేటకు చెందిన ఆకు రాతి జోష్ణ దేవి, పాలకొల్లుకు చెందిన గొర్రెల కృష్ణ, ముగ్గురిని అరెస్టు చేసినట్లు తెలిపారు. ముఖ్యంగా ఒంటరిగా ఉన్న మహిళలు, ఏదైనా ఊరు పనిమీద వెళ్లేవారు, ఆటో బస్సు కోసం ఎదురుచూసే వారే లక్ష్యంగా చేసుకుని బంగారం దోచుకునే వాడని తెలిపారు. జోష్ణ దేవికి, వెంకటేష్‌కి పరిచయం కావడంతో సీసలి గ్రామంలో దొంగతనానికి వెంకటేశ్వర కలిసి జోష్ణ దేవి పాల్పడింది. వెంకటేష్ దొంగలించిన బంగారాన్ని గొర్రెల కృష్ణ కొనుగోలు చేశాడు. కృష్ణ భీమవరం అట్టికా గోల్డ్ కంపెనీలో లావాదేవీల ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తున్నాడు. బంగారాన్ని ఉద్దేశపూర్వకంగా విక్రయించడంతో కృష్ణతో పాటు కంపెనీ యాజమాన్యంపై కూడా కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కేసుని చాకచక్యంగా చేదించిన ఎస్ఐ శ్రీనివాస్‌ని, సిబ్బందిని అభినందించారు. ఈ కార్యక్రమంలో డిఎస్‌పి ఆర్.జైసూర్య, ఆకివీడు సిఐ వి.జగదీశ్వర్ రావు పాల్గొన్నారు.

సిఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

కాళ్ల: ఉండి నియోజకవర్గంలో వివిధ అనారోగ్య కారణాలతో బాధపడుతున్న వారికి వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి రూ.19.13 లక్షలు మంజూరయ్యాయి. పెదఅమిరంలోని తన నివాసంలో డిప్యూటీ స్పీకర్, ఉండి ఎంఎల్‌ఎ కనుమూరు రఘురామ కృష్ణరాజు సిఎంఆర్ఎఫ్ చెక్కులను మంగళవారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. లబ్ధిదారులకు అందజేసి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. సకాలంలో బాధితులకు ఆర్థిక సహాయం అందజేయడం ద్వారా కూటమి ప్రభుత్వం ప్రజల ఆరోగ్యం, సంక్షేమం పట్ల శ్రద్ధ చూపుతుందన్నారు. ప్రభుత్వం అందజేసే సాయాన్ని సక్రమంగా వినియోగించుకోవాలని సూచించారు.

కొనసాగుతున్న రీసర్వే

ఆకివీడు : మండలంలో దుంపగడప, ఐ భీమవరం, ఆకివీడు గ్రామాలలో గత మూడు రోజులుగా ఉప్పుటేరు వెంబడి రెండు జిల్లాల సరిహద్దులు రీ సర్వే జరుగుతోంది. ఏలూరు పశ్చిమగోదావరి జిల్లాల సరిహద్దుల్లో ఉన్న ఉప్పుటేరు వెంబడి రెండు జిల్లాల సర్వేయర్లు ఆయా జిల్లాల డిప్యూటీ సర్వే ఇన్‌స్పెక్టర్ ఆధ్వర్యంలో ఈ రీ సర్వే నిర్వహిస్తున్నారు. ఈ రెండు జిల్లాల సరిహద్దులు నిర్ణయించేందుకు ఏలూరు జిల్లాలో సోమేశ్వరం, పశ్చిమగోదావరి జిల్లాలో దుంపగడప, ఐ భీమవరం గ్రామాలను పైలెట్ గ్రామాలుగా ప్రభుత్వం నిర్ణయించిందని జిల్లా సర్వే డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జిఎస్ఎస్.మల్లికార్జునరావు తెలిపారు. రెండు జిల్లాల సర్వే అనంతరం ప్రభుత్వ ఉన్నతాధికారులు ఇచ్చిన ఆదేశాల మేరకు ముందుకు వెళ్తామని ఆయన చెప్పారు. గత రెండు రోజులుగా జరుగుతున్న ఈ సర్వేలో పశ్చిమగోదావరి జిల్లా సర్వే డిఐ మల్లికార్జునరావు బృంద సభ్యులు, మండల ఇన్‌ఛార్జ్ సర్వేయర్ ప్రవీణ్ కుమార్, సరిహద్దు జిల్లా రీసర్వే డిఐ టిబిఎస్‌వి.రమణారావు, పాల్గొన్నారు. ఈ సర్వే మరో రెండు రోజులు పట్టవచ్చు అని అధికారులు చెబుతున్నారు.

నేడు ఏలూరులో జాబ్ మేళా

పెనుమంట్ర : జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ(సీడాప్) ఎపిఎస్ఎస్‌డిసి, జిల్లా ఉపాధి శాఖలు సంయుక్తంగా విభిన్న ప్రతిభావంతులకు వివిధ ప్రయివేటు, కార్పొరేట్ రంగాలలో ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించుటకు ఈనెల 29వ తేదీ బుధవారం ప్రత్యేక జాబ్ మేళా నిర్వహిస్తున్నారు. స్థానిక వైటిసి(యూత్ ట్రెనింగ్ సెంటర్), పెద్ద రైల్వే స్టేషన్ ఎదురుగా, అల్లూరి సీతారామరాజు స్టేడియం వెనుక, ఏలూరులో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు డిఆర్‌డిఎ పీడీ డాక్టర్ ఆర్.విజయరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ మేళాలో బిగ్ బాస్కెట్, రిలయన్స్, కళానికేతన్, ఎంసిసి-సిఇఐ, ఇ-విండ్య, అమోజన్ కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారని, సుమారు 200 మంది నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరుగుతుందన్నారు. ఈ జాబ్ మేళాకు పదవ తరగతి, ఇంటర్, ఐటిఐ, డిగ్రీ, పిజి వంటి విద్యార్హతలు ఉండి 19-30 సంవత్సరాల వయసు కల వారు అర్హులని తెలిపారు. ఇతర వివరాలకు 9281097229, 9493482414, 8978524022, 9440042901 ఫోన్ నెంబర్లను సంపాదించాలని పేర్కొన్నారు. ఈ జాబ్ మేళాకు హాజరయ్యే అభ్యర్థులు తమ బయడేటా, సర్టిఫికెట్స్ నకళ్లతో హాజరు కావాలని విజయరాజు కోరారు.

పాస్‌పోర్టు పోయినది

ప॥గో॥జిల్లా, పెనుమంట్ర మండలం, మామూదురు గ్రామానికి చెందిన సత్తివాడ జగదీశ్వరరావు, తండ్రి: వెంకటేశ్వరరావు అను నేను నా యొక్క పాస్‌పోర్ట్ పడిపోయింది. మామూదూరు మా ఇంటి నుండి బ్రాహ్మణ చెర్వు మోటార్ సైకిల్ పై వెళుతుండగా నా యొక్క పాస్‌పోర్ట్ పడిపోయింది. **పాస్‌పోర్ట్ నెంబర్ V7811961** గల పాస్‌పోర్ట్ ఏవరికైన దొరికిన యెడల ఈ క్రింది అడ్రస్ కు తెలియజేయగలరు.

సత్తివాడ జగదీశ్వరరావు
తండ్రి : వెంకటేశ్వరరావు
మామూదూరు,
పెనుమంట్ర మండలం, ప॥గో॥ జిల్లా
సెల్: 90302 45917

దస్తావేజు పోయినది

నా క్లయింటు తాళ్ళ ముదునూరు గ్రామం, తాడేపల్లిగూడెం మండలం లో **R.S.No: 289/1** లో గల పంట భూమి తాడేపల్లిగూడెం **S.R.O** లో రిజిష్టర్ కాబడిన డాక్యుమెంట్ యొక్క **లింక్ డాక్యుమెంట్ నెం: 279/1963** లో రిజిష్టర్ కాబడి ది. 26-12-2024 సం॥ తేదీన సుమారు 11-00 గంటల సమయంలో పెంటపాడు గ్రామంలో జిరాక్స్ తీసుకొని వస్తుండగా సదరు డాక్యుమెంట్ పడిపోయినది. మేము ఎంత వెతికినా సదరు డాక్యుమెంట్ కనిపించి యుండలేదు. కావున ఎవరికైనా ఆ డాక్యుమెంట్ దొరికిన యెడల ఈ క్రింది అడ్రసుకు తెలియజేయగలరు.

క్లయింటు అడ్రస్:	అడ్వకేట్ అడ్రస్:
తమ్మన శ్రీరామ మూర్తి	**పి. ప్రవీణ్ ప్రకాష్**
S/o వెంకట వరద మంగరాజు	M.B.A.,LL.B.
డోర్ నెం: 10-20-26/1	అడ్వకేట్,
తాళ్ళ ముదునూరుపాడు	తాడేపల్లిగూడెం
తాడేపల్లిగూడెం మండలం	ప॥గో॥జిల్లా
ప॥గో॥జిల్లా	సెల్: 83096 19225
సెల్: 94412 22380	95158 25368

మహారాజశ్రీ పాలకొల్లు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో
ఒ.యస్.నెం. 58/2024

బిట్వీన్:
బొల్లా వీర వెంకట శ్రీనివాస్ ...వాది
వెర్సెస్
మద్దుల సత్య కిషోర్ ...ప్రతివాది
టు:
మద్దుల సత్య కిషోర్, తండ్రి: సూర్య ప్రభాకర్ రావు, ప్లాట్ నెం. 401, 3వ ఫ్లోర్, అమరావతి అపార్ట్‌మెంట్, సూర్యతేజస్ నగర్, పాలకొల్లు, పాలకొల్లు మండలం, ప॥గో॥జిల్లా

పై నెంబరు దావాలో ప్రతివాది యైన మద్దుల సత్య కిషోర్ హాజరు నిమిత్తం **ది. 20-02-2025 సం॥రం తేదీకి** వాయిదా వేసి యున్నారు. కావున సదరు వాయిదా రోజున పై కోర్టువారి ఎదుట **ఉదయం 10:30 ని॥లకు** మీరు స్వయంగా కానీ, మీ న్యాయ వాది గారి ద్వారా కానీ హాజరు అయి మీ వాదన దాఖలు చేసుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమందు దావా ముందు గ్రంధము జరుపబడును.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

యం. వెంకట రామిరెడ్డి
న్యాయవాది.
పాలకొల్లు, ప॥గో॥జిల్లా.
పాలకొల్లు
27-01-2025